ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కుమరం భీం జిల్లా వార్తలు

చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి

సిర్పూర్(యు), జనవరి 12: గిరిజన యువత చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎస్సై రాజు, ఆదివాసీ కాంగ్రెస్‌పార్టీ జిల్లాచైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని నేటూర్‌లో శ్రీ ఆంజనేయయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ ఆటలపోటీలను వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలపోటీలు గ్రామీణ యువకుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్క. హీరాబాయి, ఉప సర్పంచ్ గోడం మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మూడో పులి కోసం అన్వేషణ

- ట్రాకర్స్‌తో పాదముద్రల కోసం గాలింపు
- పులుల మృత్యువాత కేసులో ఇద్దరి రిమాండు



అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఉన్న గిరిజనులు

కాగజ్‌నగర్, జనవరి 11: దరిగాం అటవీ ప్రాంతంలో రెండు పులుల మృత్యువాత పడగా మూడో పులి కోసం అధికారుల అన్వేషణ కొనసాగుతోంది. ఈ పులి బతికి ఉందా...? లేక మృతి చెందిందా అన్న విషయం ఇంతవరకు అధికారులు ప్రకటించటం లేదు. చనిపోయిన ఆవును మూడుపులులు తిన్నట్టు ట్రాప్‌కెమెరాలో రికార్డు కాగా, శనివారం ఒక పులి, సోమవారం ఒక పులి మృతి చెందిన విషయం తెలిసిందే. ట్రాకర్స్‌తో పాదముద్రల కోసం అన్వేషణ సాగిస్తున్నాఇంత వరకు ఆచీగతీ లేదు.

భయం..భయంగా గిరిజనులు

పులుల మృత్యువాత కారకులుగా పేర్కొంటూ రెండ్రోజులుగా అటవీశాఖ అధికారులు గిరిజనులను తీసుకెళ్తుండటంతో వారు భయభ్రాంతులకు గురవుతున్నారు. శుక్రవారం వాంకిడి మండలం రెంగారీట్, సర్కపల్లి గ్రామానికి చెందిన ఆత్రం జలపతి(26), కోవ గంగు(25)ను సిర్పూరు(టి) కోర్టుకు తరలించి రిమాండుకు పంపించారు. అధికారుల తప్పిదాలను కప్పి పుచ్చుకునేందుకు అమాయకులైన తమపై కేసులు పెడుతున్నారని గిరిజనులు పోరుబాటకు సిద్ధ పడుతున్నారు. అమాయక గిరిజనులపై అటవీశాఖ అధికారులు తప్పుడు కేసులు పెడుతున్నారని బీఎస్పీ రాష్ట్రఅధ్యక్షుడు ఆర్ఎస్‌ప్రవీణ్ కుమార్ ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. పులుల మత్యువాత విషయాన్ని అటవీశాఖ అధికారులు అంతా రహస్యంగా విచారిస్తున్నారు. అసలు ఏంజరుగుతోంది..? అధికారులు అంతా రహస్యంగా ఎందుకు చేపడుతున్నారు.? కనీసం ప్రెస్‌కు ఎందుకు సమాచారం ఇవ్వడం లేదనే ప్రశ్నలు అందరిలోనూ తలెత్తుతున్నాయి. ఉదయం నుంచి అటవీశాఖ కార్యాలయానికి రెంగారీట్, సర్కపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు చేరుకున్నారు. పులుల మృత్యువాతకు దారితీసిన పరిస్థితుల్లో ఉన్నతాధికారులపై చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. కాగా ఇక్కడి పరిస్థితులను రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి దృష్టికి గిరిజన సంఘాల నాయకులు తీసుకెళ్లారు. ఉదయం నుంచి జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి కూడా గిరిజనులు పోరుబాటుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, గిరిజనహక్కుల పోరాట సమితి అధ్యక్షుడు సోయం చిన్నయ్య భవిష్యత్తు కార్యచరణపై గిరిజన సంఘాల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

పులుల మృత్యువాతలో.. ఇద్దరికి జైలు

కాగజ్‌నగర్/సిర్పూరు(టి): మండలంలోని దరిగాం అటవీప్రాంతంలో పులుల మృత్యువాతకు కారణమైన ఇద్దరిని శుక్రవారం అటవీశాఖ అధికారులు సిర్పూరు(టి) కోర్టు మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. వాంకిడి మండలం రెంగారీట్, సర్కపల్లి గ్రామానికి చెందిన ఆత్రం జలపతి(26), కోవగంగు(25) ప్రధానసూత్రదారులుగా పేర్కొంటూ సిర్పూరు(టి) కోర్టుకు అటవీశాఖ అధికారులు ఆధారాలు సమర్పించారు. అనంతరం వీరిద్దరిని జైలుకు తరలించినట్టు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

జంగో లింగో దీక్షలు స్వీకరించాలి

- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్



దీక్ష స్వీకరిస్తున్న ఎంపీ సోయం బాపూరావ్

జైనూర్, జనవరి 12: గోండిధర్మ సంస్కృతి పరిరక్షణ కోసం ఆదివాసులు తప్పనిసరిగా జంగో లింగో దీక్షలు తీసుకోవాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. మండలంలో గల జంగో లింగో పుణ్యక్షేత్రంలో శుక్రవారం ఆయన సత్యనిష్ఠతో కిషన్‌రావ్ మహరాజ్ చేతుల మీదుగా జంగోలింగో దీక్ష తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. జంగో లింగో దీక్షల పుణ్యంతోనే తాను ఎంపీగా ఉన్నానన్నారు. జంగో లింగో దీక్షతో రోజుల పాటు కఠోర నియమాలతో ఉన్నప్పుడు కుటుంబంలో శాంతి ఏర్పడటమే కాకుండా ఇబ్బందులు, కష్టాలు క్రమంగా దూరమవుతా యని అన్నారు. చిన్నారులను విద్యావంతులుగా తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో గోండిధర్మ పరిరక్షణ సమితి పీఠాధిపతి కుంరం భగ్వంత్‌రావ్, సర్పంచ్ కుంరం శ్యాంరావ్, గోండి కోయ పున్యాం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం ఆనంద్‌రావ్, కుంరంభీం మనుమడు కుంరం సోనేరావ్, ఘన సాంస్థాన్ అధ్యక్షుడు ఆత్రం రఘునాథ్, భక్తులు పాల్గొన్నారు.

- ఆర్టీసీ బస్సుల్లో పెరిగిన రద్దీ
- దహెగాంకు రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సు రాదు
- విద్యార్థులకు తప్పని తిప్పలు



బస్సెక్కేందుకు తోపులాడుకుంటున్న ప్రయాణికులు



కాగజ్‌నగర్ బస్టాండులో బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు

బహు కష్టంగా.. బస్సు ప్రయాణం..

కాగజ్‌నగర్, జనవరి 12: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగింది. బస్సుల సంఖ్య పెంచకపోవటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో కొన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ కూడా బస్సులను నడిపించటం లేదు. దీంతో నిత్యం ఆటోలు, జీపుల ద్వారా ప్రయాణిస్తున్నారు. కాగజ్‌నగర్-దహెగాంకు, రెబ్బెన మండల కేంద్రం నుంచి తుంగెడకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సులు వేయటం లేదు. కాగజ్‌నగర్-కౌటాలకు ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు నడుస్తున్నా ప్రయాణికులకు సరిపోవడం లేదు. అదనంగా బస్సులు వేయాలని ప్రయాణికులు మండిపడుతున్నారు. బస్సు సామర్థ్యంకు మించి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని పేర్కొంటున్నారు. మహాలక్ష్మి పథకంతో మహిళల ప్రయాణాలు టార్గెట్‌కు మించి వస్తుండటంతో బస్సుల్లో ప్రయాణికులు ఫుట్‌బోర్డుపై నిల్చుని ప్రయాణం చేస్తున్నారు. దీంతో ఏదైనా ప్రమాదం జరిగితే ఎలా అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బస్టాండులో కిట కిట..

ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ బస్టాండులు ప్రయాణీకులతో రద్దీగా ఉంటున్నాయి. జిల్లాకేంద్రం నుంచి మంచిర్యాల, ఆసిఫాబాద్‌కు నిత్యం 20 బస్సులు నడుపుతున్నారు. బెజ్జూరు, కౌటాల, సిర్పూరు(టి) మండలాల నుంచి కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలకు విద్యా ర్థులు ప్రయాణం చేస్తుంటారు. దీంతో ఉదయం, సాయంత్రం విద్యార్థులతోనే బస్సులు నిండిపోతున్నాయి. ఈ మార్గం గుండా అదనంగా మరి ట్రిప్పులు నడిపించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం సెల వుల సీజన్ కాబట్టి విద్యార్థులు తప్పకుండా వెళ్లాల్సి ఉంటోంది. ఒక వైపు బస్సులు మహిళలతో నిండి పోతుండటం, మరో వైపు విద్యార్థులు ఉండటంతో బస్సులు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. రెండ్రోజుల క్రితం ఓ బస్సు కూడా ఫెయిల్ అయింది. ప్రయాణికుల రద్దీతో బస్సుల కండీషన్ దెబ్బతింటోందని సిబ్బంది పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సుల సంఖ్యను పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

మరిన్ని బస్సులను నడిపించాలి..

-విష్ణు, కౌటాల



మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో రద్దీ పెరిగింది. ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలి. తాము నిత్యం కళాశాలకు వెళుతాం. మహిళా ప్రయాణికులతో ఇబ్బందిగా ఉంది. బస్సులో ఫుట్ బోర్డుపై ప్రయాణం చేయాల్సి వస్తోంది.

గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని బస్సులు నడిపించాలి..

-శ్రావణ్, కౌటాల



గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని బస్సులు నడిపించాలి. మహా లక్ష్మి పథకంతో మహిళలతో రద్దీ అధికంగా ఉంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలు, జీపులను ఆశ్రయించాల్సి వస్తోంది. కాగజ్‌నగర్-కౌటాల, కాగజ్‌నగర్-దహెగాం మండలాలకు బస్సు సౌకర్యం కలిపించాలి. చాలా రద్దీగా ఉండే ప్రాంతాలు. అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలి.

గ్రంథాలయ భవనాన్ని త్వరగా నిర్మించాలి: కలెక్టర్



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, జనవరి 12: జిల్లాకేంద్రంలో నూతనంగా చేపట్టిన జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్మితమవుతున్న జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణపనులను, జిల్లా కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠకులకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైనఅన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా గ్రంథాలయ నూతన భవన నిర్మాణపనులను త్వరితగతిన పూర్తిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. శాఖ గ్రంథాలయాల్లో పాఠకులకు అవసరమైన పుస్తకాలతోపాటు పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ..

టీయూటీఎఫ్ నూతనసంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టర్ హేమంత్ బోర్కడే ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సదాశివ్, వెంకట్‌రావు, రవీందర్, సీహెచ్ రవీందర్, ప్రవీణ్, జి శ్రీనివాస్, ధన్‌రాజ్,ప్రకాష్,శంకర్‌రావు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు

ఆసిఫాబాద్, జనవరి 12: హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ మొదటి అదనపు జిల్లా సెషన్స్‌కోర్టు జడ్జి యువరాజ్ శుక్రారం తీర్పు ఇచ్చారు. కోర్టు లైసనింగ్ అధికారి ఎస్సై సాగర్, కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్సై బాలాజీ తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూరు పోలీసు స్టేషన్‌లో 2021లో హత్యాయత్నం చేసిన ఘటనలో తొగరం పరదేశి అనే వ్యక్తిపై అప్పటి ఎస్సైసాగర్ కేసునమోదుచేసి రిమాండ్‌కు పంపారు. పోలీసుల విచారణ అనంతరం సాక్ష్యాదారాలతో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో పోలీసు సాక్ష్యులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసాద్ ప్రవేశపెట్టిన సాక్షుల విచారణ అనంతరం కేసు పూర్వపరాలను పరిశీలించిన అదనపు జిల్లాసెషన్స్ కోర్టు న్యాయమూర్తి యువరాజు నిందితుడికి మూడు సంవత్సరాలు జైలుశిక్ష, సెక్షన్ 307ఐపీసీ కింద రూ.3వేల జరిమానా విధించినట్లు బెజ్జూరు ఎస్సై విక్రం తెలిపారు.

మినీ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే హరీష్‌బాబు



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

బెజ్జూరు, జనవరి 12: మండలకేంద్రంలో మినీ స్టేడియం మంజూరుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాఆబు అన్నారు. శుక్రవారం మండలంలోని కుంటలమానేపల్లి గ్రామంలో యువకులు ఏర్పాటుచేసిన కుమరంభీం గ్రామీణ వాలీబాల్ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి యజ్ఞంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. క్రీడలు నిర్వహించిన యువకులు అభినందనీయులన్నారు. మండలంలో ఎక్కడైనా స్థలం పరిశీలన చేయాలని అధికారులకు సూచించారు. ఐటీడీఏ నిధులు ఎస్టీలకు చేరేలా చర్యలు తీసుకుంటామని, సమస్యలుంటే తమ దృష్టికితీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేకు సర్పంచ్ విజయ్, గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ముందుగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అనంతరం తుమ్మలగూడలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్విని యోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. విశ్వకర్మ యోజన పథకానికి చేతి వృత్తుల వారు దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంటలకు మందుల పిచికారి చేసే డ్రోన్ యంత్రాన్ని ఎగరవేశారు. కార్యక్రమంలో ఏఈ మక్బుల్, కార్యదర్శి వెంకన్న, పీఈటీలు ధర్మయ్య, పుల్లయ్య, మహేష్, సర్పంచ్ విజయ్, మాజీ సర్పంచ్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పతాకావిష్కరణ..

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ సర్‌సిల్క్ సద్గురు దేవానంద ఆశ్రమంలో పతాకావిష్కరణ కార్యక్రమాన్ని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు నిర్వహించి పలు పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పాము కాటుతో బాలిక మృతి



కల్పన(ఫైల్)

వాంకిడి, జనవరి 12: వాంకిడి మండలకేంద్రానికి చెందిన బావునే కల్పన(10) శుక్రవారం పాముకాటుతో మృతిచెందినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కల్పన ఇంట్లో గోడకు ఉన్న సెల్ఫ్‌కు కాలుపెట్టి సెల్‌ఫోన్ చూస్తుండగా పాము కాటేసింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆమెను వాంకిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడవైద్యులు వైద్యపరీక్షచేసి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లిదండ్రులు దినకర్, సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.



టీఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సస్పెన్షన్

బెల్లంపల్లి, జనవరి 12: టీఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మకాయల ఏడుకొండలును యూనియన్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు యూనియన్ అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్ శుక్రవారం తెలిపారు. ఏడుకొండలు యూనియన్‌కు వ్యతిరేకంగా వాట్సాప్‌లో, పత్రికల్లో ప్రకటనలు ఇచ్చాడని, ఈవిషయం కేంద్రకమిటీ నాయకులదృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. దీంతో ఏడుకొండలును యూనియన్‌నుంచి సస్పెండ్ చేశామన్నారు. ఇక నుంచియూనియన్‌తో అతనికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జైపూర్, జనవరి 12: కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాటాలు చేస్తుందని కేంద్రకమిటీ ఉపాధ్యక్షుడు కలవేన శ్యాం, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ స్వామి పేర్కొన్నారు. శుక్రవారం ఐకేపీ1ఏ, ఓసీపీలో ఐఎన్‌టీయూసీ భరోసాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిపోయినా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఐఎన్‌టీయూసీ ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు భీంరావు, శ్రీనివాస్, వెంకటస్వామి, పేరం రమేష్,నర్సింగ్, రాంచందర్‌నాయక్ పాల్గొన్నారు.

చర్చలు సఫలం

రెబ్బెన, జనవరి 12: సింగరేణికాలరీస్ కోల్ ట్రాన్స్‌పోర్టు కార్మికుల వేతనాలు పెరగాలని మూడు రోజుల నుంచి నిరవధిక సమ్మెచేయగా, శుక్రవారం జీఎం కార్యాలయంలో చర్చలు జరిగినట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ తెలిపారు. పలు డిమాండ్లను పరిష్కరించేందుకు యాజమాన్యం ఒప్పుకున్నట్లు వివరించారు. ప్రతినెల 10వ తేదీలోపు జీతాలు చెల్లింపు, ఇపీఎఫ్, తదితర డిమాండు పరిష్కరించినట్టు పేర్కొన్నారు. చర్చల్లో జీఎం రవిప్రసాద్, ఇతరశాఖ అధికారులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలకు లోనుకావొద్దు



కాన్ఫరెన్సులో పాల్గొన్న జీఎం, ఇతర అధికారులు

మందమర్రి టౌన్, జనవరి 12: సింగరేణి అధికారులు, ఉద్యోగులు సైబర్‌మోసాలకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలని కార్పొరేట్ డీజీఎం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఏరియా జీఎంతో పాటు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. ఇటీవల చాలామంది గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎం పిన్ నంబర్లు, బ్యాంకు ఖాతాలు, ఓటీపీ నంబర్లు అడుగుతున్నారని, వారికి ఎలాంటి వివరాలు చెప్పవదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఉద్యోగులకు ఫోన్ చేసి మీకు లాటరీ తగిలిందని, మాయమాటలు చెబుతుంటారని, వాటికి స్పందించవద్దన్నారు. ఈ సందర్భంగా మోసాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అన్ని గనుల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

బొగ్గు సంస్థలను ఐక్యంగా కాపాడుకోవాలి



అమర్‌జిత్ కౌర్‌ను సన్మానిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జనవరి 12: ఏఐటీయూసీ ద్వారా ఐక్యంగా ఉద్యమించి బొగ్గుసంస్థలను కాపాడుకోవాలని ఆ యూనియన్ జాతీయకార్యదర్శి అమర్‌జిత్‌కౌర్ అన్నారు. ఏఐటీయూసీ మహారాష్ట్ర మూడవమహాసభలు చంద్రపూర్‌లో శుక్రవారం జరిగాయి. ముందుగా అమర్‌జిత్‌కౌర్‌ను సింగరేణి కాలరీస్‌వర్కర్స్‌యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్రఅధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఉప ప్రధానకార్యదర్శులు కె వీరభద్రయ్య, ముష్కే సమ్మయ్య, కేంద్రకార్యదర్శి ఎండీ అక్బర్‌అలీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఉదారీకరణతో బొగ్గు రంగం కుదేలవుతోందన్నారు. అన్ని ప్రభుత్వాలు ప్రభుత్వ రంగాన్ని లేకుండాచేయాలని చూస్తున్నాయని, వారి పన్నాగాలను తిప్పికొట్టాలన్నారు. పెద్ద ఎత్తున ఉద్యమించడం ద్వారా బొగ్గు తయారీరంగాన్ని, కార్మికులకు కాపాడుకుందామని సూచించారు.

కాలం చెల్లిన యంత్రాలను తొలగించాలి

కాసిపేట, జనవరి 12: కాసిపేట1,2 గనుల్లో కాలం చెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాలను తొలగించాలని ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం గనులపై ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ మాట్లాడుతూ కొంతకాలంగా ఎస్‌డీఎల్ యంత్రాలు మరమ్మతులు లేక మొరాయిస్తున్నాయన్నారు. కాలం చెల్లిన యంత్రాలతో ఆపరేటర్లు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. యంత్రాలు మొరాయించడంతో ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేక పోతున్నామన్నారు. వెంటనే కొత్త ఎస్‌డీఎల్ యంత్రాలను తీసుకురావాలని సూచించారు. అనంతరం గని మేనేజర్ అల్లావుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మీనుగు లక్ష్మీనారాయణ, గొల్ల శ్రీనివాస్, కొండపల్లి నర్సయ్య, లింగమూర్తి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి..

మందమర్రి టౌన్: ఏరియాలోని కేకే5 గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన బాధ్యత గని అధికారులపై ఉందని బ్రాంచి జాయింట్ సెక్రెటరీ కంది శ్రీనివాస్, పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్ తెలిపారు. శుక్రవారం గనిపైనిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ గనిలో ఎస్‌డీఎల్ కాలపరిమితి ముగిసిందని, సరిగా పని చేయకపోవడం వల్ల ఉత్పత్తికి అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వాటి స్థానంలో నూతనమైనవి తీసుకురావాలని తెలిపారు. గనికివెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలమయమైందని, కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని, వెంటనే ఏర్పాట్లు చేయాలన్నారు. పలు సమస్యలపై గని మేనేజర్ భూశంకరయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రేంరావు, కొండయ్య, సురేందర్, శ్రీనివాస్, సంపత్, కుమార్, రాంబాబు, రాజయ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కళాకారులకు అవకాశాలు కల్పించాలి

శ్రీరాంపూర్, జనవరి 12: సింగరేణిలో నిర్వహించే ప్రతికార్యక్రమంలో తమకు అవకాశం కల్పించాలని సింగరేణి కళాకారుల అధ్యక్షుడు సాదనవేణి ప్రభాకర్, కార్యదర్శి పులియాల సతీష్ కోరారు. శుక్రవారం వారు సీఎండీ ఎన్ బలరామ్‌ను కలిసి ఆయనను అభినందించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రం ఆయనకు అందించారు. తాము కార్మికులము అయినప్పటికీ తాము కళానైపుణ్యం కలిగి ఉన్నామన్నారు. తమ కళను సింగరేణి అవతరణ దినోత్సవం, ఇతర కార్యక్రమాలలో వినియోగించుకోవాలన్నారు. కల్చరల్ విభాగాన్ని ప్రత్యేకంగా ఉంచాలని, వాయిద్య పరికరాలు సమకూర్చాలన్నారు. కళాకారుల సమస్యలను పరిష్కరిస్తానని సీఎండీ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ అధ్యక్ష, కార్యదర్శులు తాజుద్దీన్, రాజేశ్వర్‌రావు, సలహాదారులు కవ్వంపల్లి స్వామి, గజెల్లి రాయలింగు, కళాకారుడు రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



సీఎండీకి అభినందనలు తెలుపుతున్న కళాకారులు

క్రీడాసామగ్రి పంపిణీకి యాజమాన్యం అంగీకారం

మందమర్రి టౌన్, జనవరి 12: సింగరేణిలో కార్మిక క్రీడాకారులకు క్రీడాసామగ్రి పంపిణీ చేసేందుకు యాజమాన్యం అంగీకరించిందని ఏఐటీయూసీ బ్రాంచికార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్ తెలిపారు. శుక్రవారం మందమర్రిలో వారు విలేకరులతో మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ(స్పోర్ట్స్‌అండ్‌గేమ్స్) క్రీడావస్తువులు2021.22.23 సంవత్సరానికి సంబంధించి అందలేదని తెలిపారు. క్రీడాకారులకు దుస్తులు, ఇతర సామగ్రి రాలేదని తమ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, కొర్మి రాజ్ కుమార్ చర్చించారని, వారం రోజుల్లో సామాగ్రి అందజేస్తారని తెలిపారు. త్వరలో ఖాళీగా ఉన్న స్పోర్ట్స్ సూపర్వైజర్లను భర్తీ చేయ నున్నట్లు తెలిపారు.

రోడ్డు పనులను అడ్డుకున్న రైతులు

జైపూర్, జనవరి 12: ఇందారం ఓసీపీ పరిధిలో రామారావుపేట శివారులో సింగరేణి చేపడుతున్న రోడ్డు పనులను శుక్రవారం స్థానిక రైతులు అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ తమ పొలాలకు వెళ్లడానికి దారిలేకుండా సింగరేణి అధికారులు ఇష్టారీతిన పనులు చేపడుతున్నారని వారు మండిపడ్డారు. ఓసీపీ వల్ల తమ గ్రామం మూడు వైపులా నష్టపోయిందన్నారు. ఓసీ విస్తరణకు మరో 129ఎకరాలు సేకరించడానికి సింగరేణి యాజమాన్యం ప్రయత్నాలు చేపడుతోందని, ఎట్టి పరిస్థితుల్లో తమ భూములను ఇచ్చేది లేదని తెలిపారు. ఈసందర్భంగా జీఎం సంజీవరెడ్డి నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ రైతులు ససేమిరా అనడంతో సింగరేణి అధికారులు రోడ్డు పనులు ఆపి వెనుదిరిగి వెళ్లిపోయారు.

యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకే పోటీలు



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న రఘునాథ్‌రావు

లక్షెట్టిపేట రూరల్, జనవరి 12: గ్రామీణ ప్రాంతాల్లో యువతను ప్రోత్స హించేందుకే బీజేపీ ఆధ్వర్యంలో కబడ్డీపోటీలు నిర్వహిస్తున్నట్టు బీజేపి జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథరావు అన్నారు. స్వామి వివేకానంద జయంతి జాతీయయువజన దినోత్సవాన్ని పురస్కరించు కొని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. మైదానంలో వివేకానందుడి విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులను పరి చేయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. బీజేపి పట్టణ అధ్యక్షుడు వీరమల్ల హరిగోపాల్, మండల అధ్యక్షుడు బొప్పు కిషన్, నాయకులు కేతిరెడ్డి జగన్‌రెడ్డి మధు నరేష్‌చంద్ రమేష్‌చంద్ సిద్దార్థ రమణ గంగన్న ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గులు పోటీలు

దండేపల్లి,జనవరి 12: రెబ్బనపలి, చింతపల్లి, దండేపల్లి, నర్సాపూర్, మాద్య రిపేట గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. మహిళలు, యువతులు రంగురం గుల కలర్స్‌లతో అందమైన ముగ్గులను వేశారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర బెల్లి రఘునాథ్‌స్రవంతి దంపతులు హాజరై ముగ్గుల పోటీలను తిలకించారు. గెలుపొందిన మహిళలకు బహుమ తులతో పాటు నగదు అందజేశారు. పోటీలో పాల్గొన్ని వారదంరికి కన్సోలేషన్ బహుమతులు ప్రదానం చేశారు.

రామకృష్ణాపూర్ : పట్టణంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. మొదటి ముగ్గురితో పాటు ఇద్దరికి కన్సోలేషన్ బహుమతులు, మిగిలిన వారికి జ్ఞాపికలు అందించారు. పాఠశాల డైరెక్టర్ పొన్నాల వినయ్, ప్రిన్సిపాల్ పొన్నాల సుమన్, పర్యావరణ విద్య జిల్లా సమన్వయాధికారి గుండేటి యోగేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

వెదురు కళాకృతాల శిక్షణ కేంద్రం ప్రారంభం

దహెగాం, జనవరి 12: మండల కేంద్రంలో వెదురు కళాకృతుల శిక్షణకేంద్రాన్ని మేదరిసంఘం నాయకులు శుక్రవారం ప్రారంభిం చారు. ఒకనెలరోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. అదేవిధంగా జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనవిద్యార్థిని తేలికుంట అనూషను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేదరి సంఘం జిల్లాఅధ్యక్షుడు సుల్వకనకయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, పోశన్న, వెంకటేష్, రంగయ్య పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

దహెగాం, జనవరి 12: మండల కేంద్రానికి సమీపంలో కాగజ్‌నగర్ ప్రధానరహదారిపై ఎస్సై సనత్‌కుమార్ శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాలు లేనివారికి జరిమా నాలు విధించారు. లైసెన్సు కలిగిఉండాలని, హెల్మెట్ ధరించాలన్నారు.

పాము కాటుతో ఎద్దు మృతి

జైనూర్, జనవరి 12: మండలంలోని గూడమామడ గ్రామ రైతు కుడ్మెత మోహపత్‌రావ్‌కు చెందిన ఎద్దు శుక్రవారం పాము కాటుతో మరణించింది. అప్పుచేసి కొన్న ఎద్దు మరణించడంతో వ్యవసాయం చేయటానికి ఆధారం కోల్పోయాడని సర్పంచ్ కుంర కేశవ్‌రావ్ తెలి పారు. చనిపోయిన ఎద్దు విలువ40వేల రుపాయలు ఉంటుందని, ఐటీడీఏ పీవో స్పందించి సదరు రైతుకు తక్షణమే ఆర్థిక సహాయం చేయాలని ఆయన కోరారు.

ప్రారంభమైన జగదంబాదేవి జాతర

లింగాపూర్, జనవరి 12: మండలకేంద్రంలో ప్రతి సంవత్సరంలాగే ఈసంవత్సరం కుడా శ్రీజగదంబాదేవి జాతరను గ్రామస్థులు ఘనంగా ప్రారంభించారు. ఈ జాతర లింగాపూర్‌లో1971నుంచి ప్రారంభ మైందని లింగాపూర్ గ్రామనాయక్ రాథోడ్ కిరణ్ తెలిపారు. గ్రామం లో ఉన్న జగదంబాదేవి పేరున ప్రతియేట ఈ జాతరను నిర్వహిస్తు న్నామన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలతో ర్యాలీ

జైనూర్, జనవరి 12: అయోధ్య రాముడిఅక్షింతలతో మండల కేంద్రంలో భక్తులు భారీర్యాలీ నిర్వహించారు. భాజాబజంత్రీలతో శ్రీరాముడి పాటలుపాడుతూ భక్తులు ర్యాలీలోపాల్గొన్నారు. అక్షింత లను మండలంలోని ప్రతిగ్రామానికి అందిస్తామని హిందూ ఉత్సవ సమితిసభ్యుడు ఓంత్రే పద్మాకర్, పోలిపెల్లి నరెందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సహకార చైర్మన్ కొడప హన్నుపటేల్, సర్పంచ్ మేస్రం పార్వతీబాయి, మాజీసర్పంచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

మందమర్రి టౌన్, జనవరి 12: స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించిన వివేకానంద జయంతికి ఆమె హాజరై చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన జీవితం అందరికి స్ఫూర్తి అని, ఆయన ఆశయ సాధన లక్ష్యంగా విద్యార్థులు పని చేయాలన్నారు. కరస్పాండెంట్ హీరాలాల్ ఉపాధ్యాయ, ప్రిన్సిపాల్ సుష్మ, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఏసీసీ: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలో నిర్వహించారు. సైన్స్ సెంటర్‌లో నిర్వహించిన వేడుకల్లో అదనపు కలెక్టర్ మోతిలాల్, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్‌లు పాల్గొని వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివేకానందుడు చూపిన దారిలో యువత నడవాలని సూచించారు. 20 మంది యువకులను సన్మానించి మెమోంటోలు అందజేశారు. వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్ పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్, శ్రీనివాస్,రాజేశ్వర్ పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: సైన్స్ సెంటర్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో రహీం బ్లడ్ ఆర్గనైజర్ అబ్దుల్ రహీంను అదనపు కలెక్టర్ మోతిలాల్ సన్మానించారు. రహీం 8 సంవత్సరాలుగా ఆపదలో ఉన్న వారికి రక్తం అందిస్తున్నారన్నారు.


మెమోంటోలు అందుకున్న వారితో అదనపు కలెక్టర్ మోతిలాల్, వివేకానందుని నివాళులర్పిస్తున్న తపస్ నాయకులు

హాజీపూర్: నర్సింగాపూర్‌లో స్వామి వివేకానంద జయంతిని బీజేపీ నాయకులు నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొలిశెట్టితిరుపతి, గంగారెడ్డి,రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కాసిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని సామాజిక చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడు పల్లె మల్లయ్య వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాపు, చిన్న భీమయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆంజనేయప్రసాద్, లెక్చరర్లు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ నాయకుడు బొప్పు సతీష్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివేకానందుడి జయంతి నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సత్తయ్య, తిరుపతిస్వామి, వెంకటరమణ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: స్వామి వివేకానంద జయంతిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఉషారాణి, ఎన్ఎస్ఎస్ పీవో రామయ్యలు నివాళులర్పించారు.

చెన్నూరు: చెన్నూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. లక్ష్మీనారాయణ, కొండపాక చారి, సుధాకర్, శంకర్, రాజేష్, అక్షిత, పాల్గొన్నారు.

96 గ్రాముల గంజాయి పట్టివేత

జన్నారం, జనవరి 12: మండలంలోని ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన పవన్ కళ్యాణ్ వద్ద 96 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. జన్నారంలో ఈ నెల 11న తనిఖీలు చేస్తుండగా పవన్ కళ్యాణ్ పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. తనిఖీ చేయగా 96 గ్రాముల గంజాయి లభించిందని తెలిపారు. కవ్వాలకు చెందిన రాహుల్ వద్ద కొన్నట్లు తెలిపాడని, దీంతో పవన్ కళ్యాణ్, రాహుల్‌పై కేసు నమోదు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి విలువ సుమారు రూ.2,500 ఉంటుందని తెలిపారు. పోలీసులు సర్కార్, తుకారాం, భాస్కర్, రమేష్, చంద్రమౌళి, జవహర్‌లాల్‌ను ఎస్ఐ అభినందించారు.

చైనామాంజను విక్రయిస్తే కఠిన చర్యలు

జైపూర్, జనవరి 12: ఎవరైనా చైనామాంజను విక్రయిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ రేంజ్ అధికారి సాగరిక పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఫారెస్టు బీట్ అధికారి దీక్షతో కలిసి పిల్లలకు గాలిపటం ఎగురవేయడంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ చైనామాంజతో గాలిపటాలు ఎగురవేయడం వల్ల పక్షులు, జంతువులు, మనుషులకు ప్రమాదం జరిగి ప్రాణహాని కలుగుతుందన్నారు. దీంతో ప్రభుత్వం చైనామాంజను నిషేధించిందన్నారు. చైనా మాంజాను షాపుల్లో విక్రయించినా, కొనుగోలు చేసిన చర్యలు తీసుకుంటామన్నారు.

గాలిపటాల దుకాణాల తనిఖీ

ఏసీసీ, జనవరి 12: సం క్రాంతిని పురస్కరించుకుని గాలిపటాల విక్రయాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఫారెస్టు అధికారులు శుక్ర వారం మంచిర్యాల పట్టణం లోని గాలిపటాల దుకా ణాలు, మాంజాదారాలు విక్రయించే దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. చైనామాంజను విక్రయించవద్దని దుకాణ దారులకు, చైనామాంజను వాడవద్దని వినియోగదారులకు సూచించారు ఎఫ్ ఎస్‌వో రేవతిరెడ్డి, ఎఫ్‌బీవోలు రాజశేఖర్, రవికుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

అతివేగంతో ప్రయాణిస్తే జరిమానాలు

జైపూర్, జనవరి 12: అతి వేగంతో ప్రయాణించే వాహనాలను స్పీడ్ గన్స్ ద్వారా గుర్తించి జరిమానాలు విధిస్తామని ఎస్ఐ ఉపేందర్ పేర్కొన్నారు. శుక్రవారం ఇందారం ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల వేగాన్ని స్పీడ్‌గన్స్‌తో పరీక్షించారు. ఆయన మాట్లాడుతూ వేగానికి మించి ప్రయాణించే వాహనాలను స్పీడ్ గన్స్ ద్వారా గుర్తించి జరిమానాలు విధిస్తామన్నారు. ఇందారం ఎక్స్‌రోడ్డు నుంచి చెన్నూరు వైపు స్పీడ్ లిమిట్ 60 కేఎంపీహెచ్ వేగమని, ఇందారం ఎక్స్‌రోడ్డు నుంచి గోదావరిఖని వైపు 80కేఎంపీహెచ్ వేగంతో ప్రయాణించవచ్చని తెలిపారు. జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

ఏసీసీ, జనవరి 12 : జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాలలో తూముల భీమయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఓల్డ్ మంచిర్యాల్ స్పోర్ట్స్ క్లబ్ నేతృత్వంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులకు క్రీడలపై ప్రోత్సహం కల్పిస్తామని, మంచిర్యాలలో అన్ని హంగులతో స్టేడియం నిర్మిస్తామన్నారు. తూముల నరేష్, కిషన్, ప్రధాన కార్యదర్శి ఎర్రం ప్రభాకర్, కౌన్సిలర్ సునీత, సత్యనారాయణ, చంద్రశేఖర్, పాల్గొన్నారు.

క్యాలెండర్ల విడుదల

జన్నారం, జనవరి 12: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ క్యాలెండర్లను శుక్రవారం జన్నారంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు విడుదల చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎంఈవో విజయ్‌కుమార్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న, నాయకులు మల్లేష్, శ్రీనివాస్,రాజన్న, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై గ్రామసభలు

వేమనపల్లి, జనవరి 12 : గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ఈ నెల 17 నుంచి 20 వరకు మండలంలో గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీవో లక్ష్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024-25 సంబంధించి అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. గ్రామసభకు అధికారులందరు హాజరు కావాలన్నారు. సర్పంచులు గాలి మధు, శ్రీనివాస్, తహసీల్దార్ సదానందం, ఎంపీవో బాపురావు, వైద్యుడు రాజేష్, ఏపీవో సత్య ప్రసాద్, ఏఈ దీక్షిత్, ఏపీఎం ఉమారాణి, హెల్త్ అసిస్టెంట్ బాపు, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 16 నుంచి గ్రామసభలు

చెన్నూరు, జనవరి 12: గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనుల ఎంపిక కోసం ఆర్థిక ప్రణాళిక తయారు చేసేందుకు ఈ నెల 16 నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న అక్కెపల్లి, అంగ్రాజ్‌పల్లి,డాకెపల్లి, వెంకంపేట, నాగాపూర్, 17న బీరెల్లి,చెల్లాయిపేట, కాచన్‌పల్లి, లంబడిపల్లి, ఒత్కులపల్లి, సోమనపల్లి, 18న దుగ్నేపల్లి, ముత్తరావుపల్లి, కిష్టంపేట, లింగంపల్లి, కత్తెరసాల, పొన్నారం, రచ్చపల్లి, 19న ఆస్నాద, బావురావుపేట, కొమ్మెర, పొక్కూరు, సంకారం, సుందరసాల, 20న బుద్దారం, చింతపల్లి, గంగారాం, నారాయణపూర్, ఎర్రగుంటపల్లి, సుద్దాలలో జరుగుతాయని తెలిపారు.

గ్రామసభలను సక్రమంగా నిర్వర్తించాలి

దండేపల్లి,జనవరి 12 : జీపీడీపీ ప్రణాళిక తయారీ కోసం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఈనెల 17 నుంచి 20 వరకు జీపీడీపీ గ్రామసభలను సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీవో మల్లేషం సూచించారు. శుక్రవారం కార్యాలయంలో అభివృద్ధి ప్రణాళిక నిర్వహణ తీరుపై కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీవో అంజిత్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శిరీష్, పిఆర్‌ఏఈ విక్రమ్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ రాజనర్సు, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

జన్నారం, జనవరి 12 : మండలంలోని రాంపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి కల్యాణాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. యేటా సంక్రాంతికి ముందు కల్యాణం జరుగుతుందని వేద పండితులు తెలిపారు. రాంపూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాలెపు ప్రసాద్‌రావు దంపతులు, భక్తులు పాల్గొన్నారు.


కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు, జగన్నాథస్వామి ఆలయంలో సుదర్శన హోమం

భక్తి శ్రద్ధలతో సుదర్శన హోమం

చెన్నూరు: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని జగన్నాథస్వామి ఆలయంలో శుక్రవారం సుదర్శన హోమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. లోక కల్యాణార్థం యేటా సుదర్శన హోమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు మోహనచారి తెలిపారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ సుదర్శన హోమం క్రతువును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ ప్రజలతోపాటు మహారాష్ట్ర, హైద్రాబాద్, వరంగల్, మంచిర్యాల పట్టణాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనిల్‌చారి, అజయ్‌చారి, పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా 108 గంగాజలాలతో ప్రసాద వితరణ జరిగింది. 13న ఎదుర్కోలు, 14న గోదారంగనాయకుల కల్యాణం నిర్వహిస్తామని, అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాల వితరణ జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

మందమర్రిరూరల్: గోదాదేవి కల్యాణంలో భాగంగా గద్దెరాగడిలోని చీకటి పృధ్వీ-దివ్య దంపతుల ఇంటి నుంచి ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. వేంకటేశ్వరాలయంలో కుడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం సాయంత్రం గోదాదేవి కల్యాణం నిర్వహిస్తామని పూజారులు అనంతాచార్యులు, నర్సింహాచార్యులు పేర్కొన్నారు.

ఘనంగా కూడారై ఉత్సవం

భీమారం: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు చేకుర్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు తిరుణగిరి కన్నయ్య, ప్రవీణ్‌కుమార్‌లు కుడారై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 180 ఇత్తడి గంగాలాలతో పాయసం వేసి ఉత్సవాన్ని నిర్వహించారు. ఎంపీటీసీ చేకుర్తి సరోజ, శ్రీవాణి, రమాదేవి, స్వరూపరాణి పాల్గొన్నారు.

కొనసాగుతున్న లారీ డ్రైవర్ల దీక్షలు

కాసిపేట, జనవరి 12 : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్‌అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని లారీ డ్రైవర్ల సంఘం నాయకులు చేస్తున్న దీక్షలు శుక్ర వారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. మండల అధ్యక్షుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న లారీ డ్రైవర్లపై కేంద్రం తీసుకువచ్చిన చట్టం కుట్రపూరితంగా ఉందన్నారు. ఈ చట్టం వల్ల డ్రైవర్ల జీవితాలు చీకటిమయం అవుతాయన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. ప్రవీణ్, నరేష్, కిరణ్, దుర్గయ్య, రాజమౌళి, లింగయ్య, మోహన్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల దీక్ష విరమణ

దండేపల్లి, జనవరి12: గూడెం అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్ప స్వాములు ఇరుముడి ప్రత్యేక పూజలు చేశారు. 41 రోజుల పాటు దీక్షలు చేపట్టిన భక్తులు గూడెం అయ్యప్ప మందిరంలో దీక్షలు విరమణ చేశారు. 18 మెట్ల ద్వారా అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తమ చార్యులు, వేద పండితులు పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగింది.

ఘనంగా జిజియాబాయి జయంతి

ఆసిఫాబాద్, జనవరి 12: ఛత్రపతి శివాజీ మహారాజ్ మాతృమూర్తి జిజియాబాయి జయంతి వేడుకలను ఆరె సంక్షేమసంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జైరాం మాట్లాడుతూ రాజమాత జిజియాబాయి ఛత్రపతి శివాజీని చిన్నప్పటి నుంచే దేశభక్తి నూరి పోస్తూ ధర్మాన్ని రక్షించాలని శివాజీకి నేర్పించిందని అన్నారు. అలాంటి మహనీయురాలి జయంతి జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గోపాల్, తిరుపతి, అన్నారావ్, మారుతి, దిలీప్, శంకర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి: మండలకేంద్రంలోని శివాజీ చౌక్‌లో జిజియాబాయి జయంతిని ఆరెసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెచిత్రపటానికి పూలమాలలువేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీనానయ్య, వెంకన్న, శ్రీనివాస్, రాజన్న, శ్రీమన్నారాయణ,సత్తయ్య, సురేష్, గురువు, సంజీవ్, ప్రశాంత్,అంజన్న,పోశన్న, సాయికిరణ్, సతీష్, శంకర్,చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంలో ఆరె సంఘం ఆధ్వర్యంలో జిజియాబాయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నీరేటి రేఖ, శంకర్, మోహన్, శ్యాంరావు, సత్యనారాయణ, మహేష్, ఎంపీటీసీలు సోహెల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలో ఆరెసంక్షేమ సంఘ భవనంలో జిజియాబాయి, స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లాగౌరవ అధ్యక్షుడు వానుపటేల్, మండలాధ్యక్షుడు వసంత్,దత్తు, మధుకర్, సునీల్, సోమ్‌దాష్, తిరుపతి, నానాజీ, ప్రకాష్, బిక్కాజీ, రవి, మిథున్, భీమన్న, శంకర్ పాల్గొన్నారు.

పెంచికలపేట: మండలకేంద్రంలో బీజేపీ నాయకులు స్వామివివేకానంద, జిజియాబాయి జయంతిని ఘనంగానిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మధుకర్, నగేష్, భాస్కర్, మహేష్, శంకర్, కాంతారావు, బాపూజీ, సంతోష్, పి సంతోష్, ప్రభాకర్ పాల్గొన్నారు.


ఆసిఫాబాద్‌లో నివాళులు అర్పిస్తున్న ఆరె సంఘం నాయకులు


చింతలమానేపల్లి, కౌటాలలో, పెంచికలపేట, సిర్పూర్(టి)లలో జిజియాబాయి, స్వామి వివేకానంద చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఆరె సంఘం నాయకులు, బీజేపీ నాయకులు

గ్రంథాలయం పక్కా భవనానికి కృషి చేస్తా

కెరమెరి, జనవరి 12: గ్రంథాలయానికి పక్కా భవన నిర్మాణానికి కృషి చేస్తానని వైస్ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. శుక్రవారం ఏర్పాటు గోయగాం గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. చింతకర్ర గ్రామంలోకూడా వివేకానంద జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌రజిత, ఎంపీటీసీ భీంబాయిపాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి పని కల్పించాలి: డీఆర్డీఏ పీడీ

కెరమెరి, జనవరి 12: జాబ్‌కార్డు కలిగిఉన్న ప్రతిఒక్కరికీ ఉపాధిహామీ పథకంలో పనికల్పించాలని డీఆర్డీఏ పీడీ సురేందర్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలసంఖ్య పెంచాలని, ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. పనిప్రదేశాన్ని జియోట్యాగింగ్ చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో మహేందర్, ఏపీవో మల్లయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

వాంకిడి, జనవరి 12: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల14న సంక్రాంతిపండుగను పురస్కరించుకొని ముగ్గులపోటీలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్‌పార్టీ యువజనసంఘం నాయకుడు దుర్గం ప్రశాంత్ తెలిపారు. ఈ ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమబహుమతిగా రూ.5వేలు, ద్వితియ బహుమతిగా రూ.2500, తృతీయబహుమతిగా రూ.1000 అందించనున్నామన్నారు. ఆసక్తిగల యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాటన్ జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

రెబ్బెన, జనవరి 12: మండలంలోని కాగజ్‌నగర్ జిన్నింగ్ మిల్లులో ట్రాక్టర్ డోజర్‌తో పత్తిని కుప్పచేస్తున్న సమయంలో బ్యాటరీ షార్ట్‌సర్క్యూట్‌తో పత్తికి నిప్పు అంటుకుని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే డ్రైవర్ మిల్లు యజమానులకు ఫోన్‌చేసి విషయం చెప్పటంతో అక్కడికి చేరుకొని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. రెండు ఫైరింజన్‌లు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశాయి. ఈ ఘటనలో సుమారు 2000క్వింటాళ్ల పత్తి, 100పత్తిబేళ్లు అగ్ని ప్రమాదానికి గురైనట్టు తెలిసింది. ఎంతమేర నష్టం జరిగిందనే విషయాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు.


అగ్నికి ఆహుతవుతున్న పత్తి

పీఎంకేవైలో జాతీయ యువజన దినోత్సవం

ఆసిఫాబాద్, జనవరి 12: జిల్లా మహిళా సాధికారత కేంద్రం వారి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధానమంత్రి కౌశల్ కేంద్ర యోజన నైపుణ్య శిక్షణకేంద్రంలో జాతీయ యువజనదినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెండర్ స్పెషలిస్టు రాణి మాట్లాడుతూ స్వామి వివేకానంద పుట్టిన రోజున ప్రతి యేటా జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. వివేకానంద గొప్పమహనీయుడని, భారతదేశ యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. మహిళా సాధికారత ప్రాముఖ్యతను, జెండర్ ఈక్వాలిటీ, మహిళలపై జరిగే హింస, పని ప్రదేశాల్లో మహిళలు హింసకు గురైతే181కు ఫోన్‌చేయాలన్నారు. చైల్డ్‌మ్యారేజ్‌ని ఎవరు కూడా ప్రోత్సహించకూడద న్నారు. అలాంటివి ఎక్కడైనా జరిగితే 1098కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ లిటరసీ సాగర్, ఐటీఫ్యాకల్టీ నితేష్, భీంరావు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్స్ గడువు పెంపు

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 12: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2023-24సంవత్సరానికి డిగ్రీలో ప్రవేశానికి గడువు పెంచినట్లు ఓపెన్ యూనివర్సిటీ కాగజ్‌నగర్ కేంద్రం కోఆర్డినేటర్ దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాసై ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల31 వరకు ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ పొందవచ్చన్నారు. అలాగే డిగ్రీసెమిస్టర్3,5 పరీక్షఫీజు చెల్లించేందుకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల17లోగా చెల్లించాలన్నారు. ప్రతీ సబ్జెక్టుకు పరీక్ష ఫీజు రూ. 150, అలాగేసైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఫీజు అదనంగా రూ.150చెల్లించాల్సి ఉంటుందన్నారు. సెమిస్టర్-3 పరీక్షలు ఫిబ్రవరి 16నుంచి 22వరకు, సెమిస్టర్-5 పరీక్షలు ఫిబ్రవరి 26నుంచి మార్చి2 వరకు ఉంటాయన్నారు. వివరాలకు 9866398678, 9494314314, 7382929651 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి


ఆసిఫాబాద్‌లో స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాల వేస్తున్న జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు | వాంకిడిలో నివాళులర్పిస్తున్న ఎన్ఎస్ఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్, జనవరి 12: యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని అతని అడుగుజాడల్లో నడవాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివేకానంద జయంతిని వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, సర్పంచ్‌లు భీమేష్, శ్రీనివాస్, తిరుపతి, ప్రసాద్, శంకర్, షరిఫోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

● ఆసిఫాబాద్‌పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


బెజ్జూరు: మండలకేంద్రంలో బీజేపీ నాయకులు స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలువేశారు. ఆయన ఆశయసాధనకు యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజారాం, తిరుపతి, సంతోష్, రాకేష్,తిరుపతి, శ్యాంసుందర్, సునీల్, కలంగిరి, మల్లయ్య, సందీప్, శంకర్, మల్లేష్, మహేందర్, మహేష్ పాల్గొన్నారు.

వాంకిడి: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ యువజనదితోస్సవాన్ని పురస్కరించుకొని కళాశాల విద్యార్థులు పతంగులను ఎగురవేసి సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో చంద్రయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి


పోచం మృతదేహానికి పూలమాల వేస్తున్న డీఎస్పీ కరుణాకర్, (ఇన్‌సెట్లో) పోచం

చింతలమానేపల్లి, జనవరి 12: కాగజ్‌నగర్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు అల్లూరి పోచం అనారోగ్యంతో స్వగ్రామమైన చింతల మానేపల్లి మండలం బాబాసాగర్‌లో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ సురేష్‌కుమార్ హోంగార్డు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనఆదేశాల మేరకు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కాగజ్‌నగర్ టౌన్ సీఐ బుద్ధేస్వామి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ కిరణ్.. పోచం మృతదేహాన్ని సందర్శించి పూల మాలలువేసి నివాళులు అర్పించారు. పోచం అంత్యక్రి యల నిమిత్తం రూ.10వేలు అందజేశారు. అలాగే కౌటాల సీఐ సాదిక్ పాషా తన వ్యక్తిగతంగా మరో రూ.10వేలను అందించారు. బాధిత కుటుంబ సభ్యులకు ఎటువంటి సహాయం కావాలన్నా జిల్లాపోలీసు యంత్రాంగం ఎళ్లవేళ్లలా అందుబాటులో ఉంటుందని తెలియ జేశారు.





బెల్లంపల్లిలో వీగింది

నస్పూర్‌లో నెగ్గింది

- మున్సిపాలిటీల్లో వేర్వేరు అవిశ్వాస ఫలితాలు
- క్యాతన్‌పల్లి, లక్షెట్టిపేటలో త్వరలో సమావేశాలు

మంచిర్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి, నస్పూర్ మున్సిపాలిటీల్లో శుక్రవారం చైర్మన్లపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాల్లో వేర్వేరు ఫలితాలు వచ్చాయి. అయినప్పటికీ రెండు మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ తన ఖాతాలో వేసుకుంది. గతంలో బీఆర్ఎస్ పరిపాలనలో ఉన్న మున్సిపాలిటీల్లో అసెంబ్లీ ఎన్నికల అనంతరం పెను మార్పులు చోటు చేసుకున్నాయి. మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, గడ్డం వినోద్‌లు ఎమ్మెల్యే లుగా గెలుపొందడంతో బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య పెరగడంతో రెండు చోట్ల చైర్మన్లు, వైస్ చైర్మన్లపై అవిశ్వాసం కోరుతూ మెజార్టీ కౌన్సిలర్లు కలెక్టర్‌కు నోటీసులు అందజేయగా శుక్రవారం ప్రత్యేక సమా వేశాలు ఏర్పాటు చేశారు. నస్పూర్ మున్సిపాలిటీలో 25 మంది వార్డులు ఉండగా, సమావేశానికి 19 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. సరిపడా కోరం సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని బలపరచడంతో చైర్మన్ ప్రభాకర్‌పై ప్రవేశపెట్టిన తీర్మానం నెగ్గింది. బెల్లంపల్లి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌లపై అవిశ్వాసం వీగింది. బెల్లంపల్లిలో 34 వార్డులు ఉండగా అవిశ్వాస పరీక్ష నిర్వహించేందుకు 22 మంది కౌన్సిల్ సభ్యుల ఫోరం ఉండాలి, కానీ 20 మంది మాత్రమే ఉండడంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రిసైడింగ్ అధికారి హరికృష్ణ ప్రకటించారు. దీంతో చైర్‌పర్సన్‌గా జక్కుల శ్వేత, వైస్ చైర్మన్‌గా బత్తుల సుదర్శన్‌లు వారి పదవుల్లో కొనసాగనున్నారు.

● క్యాతన్‌పల్లి, లక్షెట్టిపేటలోనూ అవిశ్వాసం

జిల్లాలో మొత్తం ఏడు మున్సిపాలిటీలు ఉండగా మందమర్రి మినహా మిగతా ఆరు చోట్ల పాలకవర్గాలు ఉన్నాయి. వీటిలో అవిశ్వాస తీర్మానాల ద్వారా ఇప్పటికే మంచిర్యాల, బెల్లంపల్లి, నస్పూర్ మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. మిగిలిన చెన్నూరు, క్యాతనపల్లి, లక్షెట్టిపేట మున్సిపాలిటీల్లో చెన్నూరు మినహా మిగతా రెండు చోట్ల కౌన్సిలర్లు అవిశ్వాసం కోరుతూ కలెక్టర్‌కు నోటీసులు అందజేశారు. రెండు చోట్ల ప్రత్యేక సమావేశాలు తేదీ ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ కౌన్సిలర్లే ఆ పార్టీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను గద్దె దించేందుకు అవిశ్వాసాన్ని కోరగా, లక్షెట్టిపేటలో బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లపై కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాసం కోరుతున్నారు.

● నస్పూర్ మున్సిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

నస్పూర్: నస్పూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది. చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. దీంతో నాలుగేళ్లపాటు చైర్మన్‌గా కొనసాగిన ఈసంపల్లి ప్రభాకర్ పదవిని కోల్పోయాడు. కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాల మేరకు మంచిర్యాల ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి వాడాల రాములు మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. నస్పూర్ మున్సిపాలిటీలో 25 వార్డులున్నాయి. కొన్ని రోజుల నుంచి హైదరాబాద్ క్యాంపులో ఉన్న కౌన్సిలర్లు నేరుగా ప్రత్యేక సమావేశానికి హాజరయ్యారు. సమావేశానికి అవసరమయ్యే కోరం 17 మంది కావాల్సి ఉండగా మొత్తం 19 మంది హాజరయ్యారు. చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌పై ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై సభ్యులు సమ్మతి తెలుపుతూ 19 మంది చేతులెత్తారు. దీంతో చైర్మన్ ప్రభాకర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ప్రిసైడింగ్ ప్రకటించారు. నివేదికను కలెక్టర్‌కు పంపిస్తానని, తదుపరి చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక తేదీని నిర్ణయిస్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్య కర్తలు, నాయకులు మున్సిపల్ కార్యాలయానికి తరలివచ్చారు. అవిశ్వాసం నెగ్గడంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలను నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐలు ఇద్దరు, ఎస్సైలు ముగ్గురు, మహిళ ఎస్సై, బందోబస్తు ఏర్పాటు చేశారు.



నస్పూర్‌లో చెతులెత్తిన కౌన్సిలర్లు

● అవిశ్వాసానికి మరో అవకాశం ఇవ్వాలి

మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసానికి మరో అవకాశం ఇవ్వాలని కౌన్సిలర్లు కోరారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వారు మాట్లాడుతూ కలెక్టర్ నుంచి వచ్చిన నోటీసుల్లో కోరంకు సంబంధించి ఎంత మంది సభ్యులు ఉండాలో వివరాలు పొందుపర్చలేదని పేర్కొ న్నారు. మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస పరీక్షకు హాజరయ్యారని, ఈ నెల 27 వరకు అవిశ్వాస సమావేశానికి సమయం ఉందని, మరో అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. అధికారులు స్పందించకపోతే కోర్టుకు వెళ్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, ఎంపీ వెంకటేష్ నేతలతో పాటు మంత్రి కేటీఆర్ సైతం 18 మంది కౌన్సిలర్లు అందరం రాజీనామా చేస్తే పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. అవిశ్వాసం వీగిపోయినా చైర్మన్, వైస్ చైర్మన్‌లపై నైతిక విజయం తమదేనని అసమ్మతి కౌన్సిలర్లు పేర్కొన్నారు.

సుపరిపాలన అందిస్తాం

- మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుర్మిళ్ళ వేణు

నస్పూర్ మున్సిపాలిటీలో గత పాలనలో అన్యాయాలు, అక్రమాలు జరిగాయి. ఆ విధమైన పాలన ఉండవద్దనే ఉద్దేశ్యంతో కౌన్సిలర్ల మందరం ఏకమై అవిశ్వాసం పెట్టాం. మిగిలిఉన్న కాలం తక్కువ సమయం ఉన్నప్పటికి సుపరిపాలన అందించడానికి శాయశక్తుల కృషి చేస్తాం. అవిశ్వాసానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ సభ్యులతోపాటు సీపీఐ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

● బెల్లంపల్లిలో...

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌లపై అవిశ్వాసం వీగింది. చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కలెక్టర్‌కు కౌన్సిలర్లు దరఖాస్తు చేసుకోవడంతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి హరికృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేతపై సమావేశం చేపట్టారు. క్యాంపు నుంచి నేరుగా కౌన్సిల్ సభ్యులు ప్రత్యేక వాహనాల్లో మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. కోరం 22 మంది కౌన్సిల్ సభ్యులకుగాను 20 మంది మాత్రమే ఉండడంతో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం వీగిపోయిందని ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. చైర్‌పర్సన్‌గా జక్కుల శ్వేత, వైస్ చైర్మన్‌గా బత్తుల సుదర్శన్‌లు యథావిధిగా వారి పదవుల్లో కొనసాగనున్నారు. ఏసీపీ సద య్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

● ఆశావాహుల్లో నిరాశ

బెల్లంపల్లి: మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లలో, చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులు ఆశించిన ఆశా వాహుల్లో నిరాశే మిగిలింది. ఎలాగైనా అవిశ్వాస తీర్మానం పెట్టి పదవులు ఆశిస్తామని కౌన్సిలర్లతో క్యాంపు బాట పట్టారు. దాదాపు 10 రోజులుగా 20 మంది కౌన్సిలర్లను హైద్రాబాద్‌లో క్యాంపునకు తీసుకువెళ్లగా ఖర్చులు తడిసి మోపడ య్యాయి. పట్టణంలో మొత్తం 34 వార్డులకు గాను ఒక కౌన్సిలర్ ఇటీవల మృతిచెందాడు. 33 మంది కౌన్సిలర్లు ఉండగా నిబంధనల ప్రకారం అవిశ్వాసం పెట్టాలంటే 2/3 లెక్కన 22 మంది సమావేశానికి హాజరుకావాలి. ప్రస్తుత చైర్‌పర్సన్ జక్కుల శ్వేత 12 మంది కౌన్సిలర్లను క్యాంపునకు తీసుకువెళ్లింది. దీంతో అవిశ్వాస సమావేశానికి 20 మంది కౌన్సిలర్లే హాజరయ్యారు. మరో ఇద్దరు కౌన్సిలర్లలో ఒకరు బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ కాగా, ఇతర పార్టీకి చెందిన మరో కౌన్సిలర్ అవిశ్వాసానికి మద్దతు ఇస్తామని చెప్పి తీరా సమయానికి రాకపోవడంతో అవిశ్వాసం పెట్టి న కౌన్సిలర్లతోపాటు ఆశావాహులు నిరాశకు గురయ్యారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులు ఆశించిన వారు కౌన్సిలర్లతో పాటు వారి కుటుంబీకులను హైద్రాబాద్‌లోని క్యాంపునకు తీసుకువెళ్లారు. పది రోజుల క్యాంపు నిర్వహణకు రూ. 20 లక్షలకు పైగా ఖర్చు అయినట్లు తెలుస్తుంది. ఇంత ఖర్చు పెట్టిన అవిశ్వాసం వీగిపోవడంతో ఆశావాహులతో పాటు అసమ్మతి కౌన్సిలర్లు నిరాశ , నిస్పృహలకు గురయ్యారు.



అవిశ్వాస తీర్మానానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు

అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయం



రమేష్‌కుమార్‌ను అభినందిస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 12: వ్యవసాయ రంగంలో వివిధ విభాగాల్లో ఏరువాక ఫౌండేషన్ వారు అందించే ప్రతిష్టాత్మక ఏరువాక అవార్డుకు జిల్లా అధికారి ఎంపిక కావడం అభినందనీయమని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అవార్డుకు ఎం పికైన జిల్లా పశువైద్య, సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు వై.రమేష్ కుమార్‌ను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఉత్తమ శాస్త్రవేత్త విభాగంలో పశువైద్య విస్తరణ నిపుణులుగా ఎంపిక చేశారని తెలిపారు. ఈ నెల 20, 21 తేదీల్లో మేడ్చల్‌లోని స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ దూలపల్లిలో అవార్డు ప్రదానోత్సవం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఓరియంట్ సిమెంట్ కంపెనీ అధ్యక్షుడు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఓరియంట్ కంపెనీ అధ్యక్షుడు సత్యబ్రత్‌శర్మ

కాసిపేట, జనవరి 12 : దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ కంపెనీ అధ్యక్షుడు సత్యబ్రత్‌శర్మ శుక్రవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేసి ఘనంగా సన్మానించారు. సిమెంట్ కంపెనీ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్,కంపెనీ లోడింగ్ కార్మికుడు కృష్ణ, భారతాని సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యం కల్పించాలి



నల్లగుడ్డలు కట్టుకుని నిరసన తెలుపుతున్న బీసీ నాయకులు

ఏసీసీ, జనవరి 12: న్యాయ వ్యవస్థలో బీసీలకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని బీసీ సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్‌లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతం బీసీలుంటే న్యాయ వ్యవస్థలో వారి ప్రాతినిధ్యం 2 శాతం మాత్రమే ఉందన్నారు. వివిధ హైకోర్టుల్లో 604 మంది న్యాయ మూర్తులు నియామకమైతే బీసీలు కేవలం 72 మంది మాత్రమేనన్నారు. న్యాయవ్యవస్థలో బీసీలకు తగిన ప్రాధాన్యం కల్పించకపోతే ఉద్యమాలు చేస్తామన్నారు. సీనియర్ న్యాయవాది కర్ర లచ్చన్న, గుమ్ముల శ్రీనివాస్, జైపాల్‌సింగ్, శ్రీపతి రాములు, పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ రాష్ట్రస్థాయి విజేతకు సన్మానం



హేమలతను సన్మానిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

మందమర్రి టౌన్, జనవరి 12: ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ఈ నెల 10న హైదరాబాద్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలో ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి గెలుపొందిన మందమర్రికి చెందిన శనిగారపు హేమలతను శుక్రవారం సన్మానించారు. సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా యేటా ఆంధ్రజ్యోతి ఏబీఎన్ జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. డా. స్వరూపరాణి ఆసుపత్రి నిర్వాహకులు స్వరూప శరత్‌బాబులు మాట్లాడుతూ జిల్లాలో నిర్వహిస్తున్న పోటీలకు స్పాన్సర్లుగా ఉండడం తమకు లభించిన అదృష్టమన్నారు. అనంతరం హేమలత దంపతులను చైర్‌పర్సన్, స్వరూప ఆసుపత్రి నిర్వాహకులతోపాటు, కళాశాల నిర్వాహకులు హీరాలాల్ ఉపాధ్యాయలు సన్మానించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చందర్, కళాశాల లెక్చరర్లు రాజేశం, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వివేక్‌ను కలిసిన షర్మిల



మందమర్రి టౌన్, జనవరి 12: చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు షర్మిల హైదరాబాద్‌లోని సోమాజిగూడలోని ఆయన నివాసంలో కలిశారు. కుమారిని వివాహానికి హాజరు కావాలని కార్డు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించి పలు విషయాలు చర్చించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రామకృష్ణాపూర్, జనవరి 12 : క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ 17వ వార్డులో రూ.2 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డును కౌన్సిలర్ రామిడి ఉమాదేవి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ రోడ్డు టీజోన్ సెంటర్ నుంచి శ్రీనివాస్ నగర్ వరకు నిర్మించనున్నారు. 7వ వార్డు కౌన్సిలర్ పొలం సత్తన్న, వ్యాపారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన న్యాయవాదులు

ఏసీసీ, జనవరి 12: ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావును జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చాలు అందించి సన్మానించారు. అనంతరం న్యాయవాదుల సమస్య లను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిర్యాలలో కోర్టు నిర్మాణానికి కృషి చేస్తానని, త్వరలోనే స్థలం ఎంపిక పూర్తి చేసి ప్రభుత్వం నుంచి నిధులు కేటాయిస్తామన్నారు. బార్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య, న్యాయవాదులు కోట మల్లయ్య, ఆకుల రవీందర్, రాజా రమేష్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో పనిచేయడానికి అవకాశం

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 12 : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్, తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా జపాన్, జర్మనీలలో పనిచేయడానికి అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బంది దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక్ వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జపాన్‌లో నర్సింగ్‌ఉద్యోగాల కోసం బీఎస్సీ నర్సింగ్,జీఎన్ఎం,ఎఎన్ఎం డిప్లొమా పూర్తి చేసి 22 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉండాలన్నారు. నెలకు రూ. 1.80 లక్షల వరకు వేతనం పొందుతారని తెలిపారు. అలాగే జర్మనీలో నర్సింగ్ అప్రెంటీస్‌షిప్ కోసం ఇంటర్‌లో 60 శాతం అంతకంటే ఎక్కువ మార్కులు సాధించి 18 నుం చి 28 సంవత్సరాల వయస్సు గల వారు దరఖాస్తు చేసుకో వచ్చన్నారు. స్థానం పొందిన అభ్యర్థులు శిక్షణ సమయంలో నెలకు లక్ష రూపాయల స్టైఫండ్, ఉద్యోగ నియామకం తర్వాత నెలకు రూ.3 లక్షల వేతనం పొందుతారని తెలిపారు. వివరాలకు 8919047600, 6302292450, 9573945684లో సంప్రదించాలన్నారు.

15 నుంచి రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

ఏసీసీ, జనవరి 12: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 19 బాలికల రాష్ట్ర స్థాయి హ్యాండ్ పోటీలను ఈనెల 15 నుంచి ఆసిఫాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేష్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పది జిల్లాల నుంచి బాలికల జట్లు పోటీల్లో పాల్గొంటాయన్నారు. క్రీడాకారులకు ఉచిత వసతి, భోజనం కల్పిస్తున్నామన్నారు.

ఎంసీహెచ్‌కు సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన

మంచిర్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలంలో మాతా శిశు సంరక్షణ కేంద్రానికి ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా శంకుస్థాపన చేయించనున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గోదావరి సమీపంలో మాతాశిశు ఆస్పత్రి నిర్మించడం వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫ్లై ఓవర్‌పై పెద్ద పెద్ద గుంతల ఏర్పడడంతో అత్యవసరంగా తారు రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. శ్రీనివాస గార్డెన్ నుంచి ఐబీ చౌరస్తా మీదుగా తోళ్లవాగు వంతెన వరకు ఫోర్‌లేన్ రోడ్డును త్వరలో ప్రారంభిస్తామన్నారు.

సంక్రాంతి పండుగ నుంచి మంచిర్యాల, నస్పూర్, లక్షెట్టిపేట ప్రజలకు రోజు రెండు గంటల పాటు నీటి సరఫరా చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మంచిర్యాల, నస్పూర్‌లో ఈనెల 14న, లక్షెట్టిపేటలో 15న ప్రారంభిస్తామని చెప్పారు. ఇప్పటికే భగీరథ నీటిని మూడు సార్లు టెస్టింగ్ కోసం హైద్రాబాద్‌కు పంపామని, నల్లాల ద్వారా సరఫరా అయ్యే నీరు తాగేందుకు యోగ్యమైందని తేలిందన్నారు. మంచినీటి ప్రారంభోత్సవాలకు మహిళలకు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

రాముడు బీజేపీ సొంతం కాదు...

అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిరం బీజేపీకి సొంతం కాదని ఎమ్మెల్యే అన్నారు. శ్రీరాముని పేరుతో ఓట్ల రాజకీయం చేయడం శోచనీయమన్నారు. రాముడు ప్రపంచంలోని ప్రతి హిందువుకు ఆరాధ్య దైవమన్నారు. కాంగ్రెస్ హిందువులకు, రామునికి వ్యతిరేకమనే ప్రచారం ప్రజల్లోకి తీసుకువెళ్లాలనే కుట్రకు బీజేపీ తెరలేపిందన్నారు. కాంగ్రెస్ హయాంలో దేశంలో అనేక హిందూ దేవాలయాలు, శ్రీరాముని ఆలయాలు నిర్మాణం జరిగాయన్నారు. ప్రతి విషయాన్ని బీజేపీ ఓట్ల దృష్టితోనే చూస్తోందని, కేసీఆర్ సైతం ఇదే తరహాలో ఉండగా ప్రజలు బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. అయోధ్యలో నిర్మిస్తున్న రామ మందిరానికి తన వంతుగా రూ.3,69,999 విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. ఈనెల 18 నుంచి జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాలలో ఐదు రోజుల పాటు రామ భజన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, నాయకులు సురిమిళ్ల వేణు, శ్రీనివాస్, బండారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'నేనెవరికీ డబ్బులు ఇవ్వలేదు'

మంచిర్యాల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తాను రూ.30 లక్షలు ఇచ్చి కాంగ్రెస్ అనుబంధ ఐఎన్టీయూసీలో చేరినట్లు వస్తున్న వార్తలు పూర్తిగా సత్యదూరమని ఆ యూనియన్ నాయకుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తన ఎదుగుదలను ఓర్వలేక కొందరు పనిగట్టుగొని బురదజల్లే ప్రయత్నంలో భాగంగా కొద్ది రోజులుగా దుష్ప్రచారం చేస్తున్నారని, సమాచార లోపం కారణంగా మావోయిస్టు నేత తాను డబ్బులు ఇచ్చినట్లు పత్రికల్లో ప్రకటనలిచ్చారని తెలిపారు. ఐఎన్టీయూసీలో తనకు తాను చేరలేదని, ఆ యూనియన్ అగ్ర నాయకులు కోరిక మేరకే తాను నిర్ణయం తీసుకోవలసి వచ్చిందని స్పష్టం చేశారు. టీబీజీకేఎస్ తొలుత పోటీకి విముఖత చూపడం కూడా ఐఎన్టీయూసీలో తన చేరికకు కారణమైందని తెలిపారు.

పదోన్నతితో బాధ్యత పెరుగుతుంది

ఏసీసీ, జనవరి 12: పోలీసు అధికారులకు పదో న్నతి ద్వారా బాధ్యత పెరుగుతుందని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి అన్నారు. కమిషనరేట్ పరి ధిలో ఎస్ఐగా పదోన్నతులు పొందిన 8 మంది, హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఏఎస్ఐగా పదో న్నతి పొందిన 10 మంది, కానిస్టేబుల్‌గా పనిచేస్తూ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన 19 మం దిని శుక్రవారం హెడ్ క్వార్టర్‌లో అభినందించారు. సీపీ మాట్లాడుతూ విధులను క్రమశిక్షణతో నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై నమ్మకం పెంచేలా కృషి చేయాలన్నారు. పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం, అధికారులు పాల్గొన్నారు.



పదోన్నతి బ్యాడ్జి అందజేస్తున్న సీపీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వేల్పుల రవి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ రాజేశ్ రవిని సన్మానించారు.

గొల్ల వాగు ప్రాజెక్టు నుంచి నీరందించాలి

భీమారం, జనవరి 12 : మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్టును శుక్రవారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు చేకుర్తి సత్యనారాయణరెడ్డి రైతులతో కలిసి సందర్శించారు. రైతులు సమస్యలను విన్నవించారు. 15 సంవత్సరాల నుంచి ప్రాజెక్టు మెయిన్ కాలువకు అమర్చిన కాలువలకు నీరు రాకపోవడంతో నీరందడం లేదన్నారు. ప్రస్తుతం బోరుబావులు, నీటి వనరులు ఉన్న చోట మాత్రమే వరి సాగు చేస్తున్నామని తెలిపారు. సత్యనారాయణ చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామికి సమస్యలను ఫోన్‌లో విన్నవించారు. అధికారులతో మాట్లాడి పంటలకు నీరందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపినట్లు పేర్కొన్నారు. రైతులు జరుపుల తౌర్యానాయక్, పిట్టల మధునయ్య, తగరం మల్లయ్య,రాజ్‌కుమార్, మాజీ ఉపసర్పంచు అమర్‌సింగ్ నాయక్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు యూనిఫాం, చెప్పులు అందించాలి

ఏసీసీ, జనవరి 12: మంచిర్యాల మున్సిపాలిటీ కాంట్రాక్టు కార్మికులకు యూనిఫాం, చెప్పులు అందజేయాలని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ విజయ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న 345 మంది కాంట్రాక్టు కార్మికులకు ఈ సంవత్సరం రావాల్సిన యూనిఫాం, చెప్పులు, వంట నూనె, సబ్బులు వెంటనే అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అశోక్‌తేజ, సలహాదారుడు రామగిరి బానేష్, సత్యం తదితరులు పాల్గొన్నారు.